క్లుప్తంగా

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

పీసీపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రవేశపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం ముద్దపాడు సచివాలయ పరిధిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరవుతారని పేర్కొన్నారు.

టంగుటూరులో...

టంగుటూరు: టంగుటూరు 3వ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన బోర్డులు మంగళవారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వావిలేటిపాడులో..

జరుగుమల్లి: మండల పరిధిలోని వావిలేటిపాడు గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు తెలిపారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలపై ప్రదర్శన బోర్డులు ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు.

పోలీసు సిబ్బందికి దుస్తులు పంపిణీ



పోలీసు సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

జరుగుమల్లి: పోలీసులు ప్రజా సేవలో మరింతగా మమేకం కావాలని మండల వైఎస్సార్ సీపీ నాయకుడు దుంపా అనిల్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో 20 మంది సిబ్బందికి రూ.20 వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, ప్రశాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

● కనిగిరి గ్రంథాలయానికి 2వేల కొత్త పుస్తకాలు

కనిగిరి రూరల్: 56వ గ్రంథావయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఈ వారోత్సవాల సందర్భంగా సభ్యుల వద్ద దీర్ఘకాలంగా ఉన్న పుస్తకాలను ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా తీసుకుంటామన్నారు. కొత్తగా గ్రంథాలయానికి 2 వేల పుస్తకాలు వచ్చాయని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వారోత్సవాల్లో వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వారోత్సవాల్లో నిర్వహించే పోటీలు ఇవి..

14వ తేదీ బాలల దినోత్సవం, వారోత్సవాలు ప్రారంభమవుతాయి. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు, 17న కవి సమ్మేళనం, 18న పుస్తక సమీక్ష, విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం వక్తృత్వం, వివిధ రకాల పోటీలు, 19వ తేదీ మహిళా దినోత్సవం, 20న ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానం చేస్తామని గ్రంథపాలకుడు వివరించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు

గుడ్లూరు: బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గుడ్లూరు–తెట్టు ప్రమాదన రహదారిలో తెట్టు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల ప్రకారం... మండలంలోని ఆదవిరాజుపాలెం గ్రామానికి చెందిన గొడపేరు రాహుల్ అనే యువకుడు తన మోటార్ సైకిల్‌పై తెట్టు నుంచి గుడ్లూరుకు వస్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వచ్చే సరికి బైక్ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడ్డ రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

20 మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేత



లబ్ధిదారులకు స్టవ్, సిలిండర్లు అందజేస్తున్న ఏజెన్సీ మేనేజర్, నాయకులు

పామూరు: ప్రధానమంత్రి ఉజ్వల జ్యోతి యోజన పథకం కింద 20 మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరైనట్లు బీజేపీ కనిగిరి నియోజకవర్గ కన్వీనర్ కే.వి.రమణయ్య తెలిపారు. ఈసందర్భంగా సోమవారం స్థానిక ఎస్ఎల్ఎన్ ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసులుతో కలిసి మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాజం చిన సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



భైరవకోన ఆలయాల్లో పూజల్లో పాల్గొన్న భక్తులు



భైరవకోనంలో త్రిముఖదుర్గాదేవి మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం (పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురం పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంతో పాటు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోన, ఇతర శైవక్షేత్రాలు పవిత్ర కార్తీకమాస వేడుకలకు సిద్ధమయ్యాయి. కార్తీకమాసం సోమవారం నుంచి ప్రారంభంకాగా ఈ క్షేత్రాల్లో కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి, చిలుకు ఏకాదశి, చిలుకు ద్వాదశి, పోలిస్వర్గం రోజులలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనుండగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొననున్నారు. అదే విధంగా ఆదివారం, సోమవారం దీపావళి సందర్భంగా వరుస సెలవుదినాలు కావడంతో భక్తులు భైరవకోనకువచ్చి జలపాతం, ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. భైరవకోన క్షేత్రంలో ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈవో నర్రా



సీఎస్‌పురంలోని కామాక్షీసమేత చంద్రమౌళీశ్వర ఆలయం

నారాయణరెడ్డిలు భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పామూరు: కార్తీకశుద్ధ పాడ్యమితో పవిత్ర కార్తీకమాసం సోమవారం సాయంత్రం నుండి ప్రారంభం కాగా మండలంలోని శైవక్షేత్రాలు ప్రత్యేకశోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయం, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షీసమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి ఆలయాలతో పాటు మండలంలోని అనుమునిగిరి శివరామ బ్రహ్మక్షేత్రం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఆలయాల్లో కార్తీకమాసంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు, భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.



పామూరులోని అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయం



బొట్లగూడూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం



పామూరు వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయం

ఘనంగా దీపావళి వేడుకలు



టంగుటూరులో కాకరపువ్వొత్తులతో సందడి చేస్తున్న చిన్నారులు



జమ్ములపాలెం పంచముఖేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న వరికూటి, కుటుంబ సభ్యులు



సింగరాయకొండలో బాణసంచా కాలుస్తున్న మహిళలు

టంగుటూరు/సింగరాయకొండ: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దీపావళి వేడుకలను ఆదివారం కొండపి నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంట్లో చిన్నా, పెద్ద తేడా లేకుండా బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఇళ్ల ముందు ప్రమిదలు, కొవ్వొత్తులు వెలిగించి శోభయమానంగా తీర్చిదిద్దారు. వల్లూరమ్మ ఆలయంతో మండలంలోని వివిధ దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

జమ్ములపాలెంలో వరికూటి పూజలు

దీపావళి సందర్భంగా జమ్ములపాలెంలోని 1116 శివలింగాల సమేత పంచముఖేశ్వరాలయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సతీమణి లక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు తదితరులు ఉన్నారు.

పామూరు: దీపావళి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్ద వయోస్సు తేడా లేకుండా పెద్దలు పిల్లలతో కలిసి బాణాసంచా కాల్చారు. అదేవిధంగా దీపపు ప్రమిదలతో దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మహిళలు, బాలికలు వెలిగించిన దీపపు ప్రమిదలతో ప్రతి ఇంట దీపపు వెలుగులు నిండాయి. వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు ఆధ్వర్యంలో వాసవీమాత అమ్మవారికి లక్ష్మీపూజ, కుంకుమపూజ తోపాటు లలితాసహస్తనామ పఠనం చేశారు.

హనుమంతునిపాడు: మండలంలో ఆది సోమవారాలు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి గుమ్మల ముందు దీపావళి దీపాలు వెలుగులతో వెన్నెలను తలపించింది. చిన్నారులు, పెద్దలు దీపావళి బాణ సంచాలు టపాలు కాలుస్తూ సంతోషాని పంచుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వెలిగండ్ల: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రజలు దీపావళిని జరుపుకున్నారు. మండలంలో ఆదివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. చిన్న పిలల నుంచి పెద్ద వాళ్ల వరకు బాణాసంచా కాలుస్తూ సంతోషంగా దీపావళిని జరుపుకున్నారు.

కందుకూరు: దీపావళి వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వేడుకల్లో బాణాసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద రెండు రోజుల పాటు రద్దీ వాతావరణం నెలకొంది. టపాసులు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే ఓగూరులో వరసిద్ధి వినాయక హోల్‌దుకాణానికి ప్రజలు భారీ ఎత్తున క్యూ కట్టారు. ధరలు అధికంగా ఉన్నా కొనుగోలు చేసేందుకు ప్రజలు మాత్రం వెనుకాడలేదు. ఆదివారం రాత్రి వీధుల్లోకి వచ్చిన యువత పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో నరకాసుర దహనం చేపట్టారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కందుకూరు పెద్దబజార్‌లో నరకాసుర దహనం

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి



ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేస్తున్న మహిళలు

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంట గ్రామంలో ప్రసిద్ధిగాంచిన కాలభైరవ ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా అభిషేకం, కూర్మాండ దీపారాధన నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా దీపారాధన చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణంలో భైరవ హోమం, గణపతి హోమం, లక్ష్మీ హోమాన్ని అర్చకుడు గూడల శ్రీనివాసులు నిర్వహించారు.

ఉభయదాతలు నల్లపురెడ్డి భాస్కరరెడి, శ్రీదేవి దంపతులు అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఇన్‌చార్జి బొందల ఆంజనేయులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గో పూజ



గో పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు



మహా నివేదనతో ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన రుత్వికులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మామిడి మొక్కలు ధ్వంసం

గుడ్లూరు: సాగు చేసిన మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన మండల కేంద్రమైన గుడ్లూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం... ఎస్సీ కాలనీకి చెందిన జి.బ్రహ్మయ్య అనే రైతులు ఉత్తర పొలంలో తమకున్న ఒకటిన్నర ఎకరాల భూమిలో మూడు నెలల క్రితం 56 మామిడి మొక్కలను నాటాడు. సోమవారం ఉదయం పొలంలోకి వెళ్లి చూడగా మొక్కలన్నింటినీ పీకేశారు. దీంతో రైతులు గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలను ధ్వంసం చేసినట్లుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటికి విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు

ముగ్గురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ ముత్తంవారిపాలెం శివారులో పేకాట శిబిరంపై ఎస్సై ఎం బాజీబాబు సిబ్బందితో దాడి చేశారు. దాడిలో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.29,050 స్వాధీనం చేసుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పూడికతీతను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ఈశ్వరమ్మ

టంగుటూరు: ప్రజలు తమ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ సూచించారు. మండలంలోని కందులూరు పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను సోమవారం ఆమె పర్యవేక్షించారు. ఆమె వెంట మన్నం వెంకయ్య, పసుమర్తి ఆనంద్, దార్ల వెంకటేశ్వర్లు, గోగుల వెంకట్రావు, దివ్యాంగుల సంఘ నాయకుడు పసుమర్తి రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో
బలహీన వర్గాల అభ్యున్నతి



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగనమోహన్‌రెడ్డి పాలనలోనే జరిగిందని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చాకిరాలలో ఎంపీపీ ప్రకాశం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రజలకు జరిగిన లబ్ధి గూర్చి తెలిపారు. చంద్రబాబు పాలనలో పేద వర్గాలకు జరిగిన మోసాన్ని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను తిరిగి ఎమ్మెల్యేగా, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా సీఎంగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ లబ్ధిదారులంతా వైఎస్సార్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. సర్పంచ్ మందా అరవిందా లూక, దంతులూరి వెంకటయ్య, పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోటారెడ్డినగర్ సచివాలయం-1 పరిధిలో నిర్వహించనున్నట్లు జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిశోర్ తెలిపారు. సాయంత్రం 3 గంటలకు సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను ఆవిష్కరించడంతో పాటు, జెండా ఆవిష్కరణ, ఇంటింటి ప్రచార కార్యక్రమం ఉంటుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉలవపాడు: మండలకేంద్రమైన ఉలవపాడు-3వ సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో అధికారులతో సంక్షేమ బోర్డు ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఉలవపాడు పరిధిలోని గ్రామకన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు గ్రామ పంచాయితీ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ రఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

కోటిరెడ్డికి వరికూటి ఘన నివాళి



కోటిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వరికూటి

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా బాలకృష్ణారెడ్డి తండ్రి కోటిరెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆసం సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి, మన్నం వెంకయ్య, సనగర కోటి, చక్కా రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ బేరి యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజా రక్షణ బేరి సభను విజయవంతం చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య అన్నారు. ప్రజా రక్షణ బేరి సభ ప్రచార వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో 1000 రోజుల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ రాజ్యసభ సభ్యుడు పి.మధు, రాష్ట్ర కార్యదర్శి వై శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గుడ్లూరు, ఉలవపాడు మండల కార్యదర్శులు జి వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, మండల నాయకులు దువ్వూరి జాన్, కుంచాల అనిల్‌కుమార్, మిట్టనోసల సుభాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముడుపులు



ముడుపులు కడుతున్న గ్రామపెద్దలు

కందుకూరు: నాగ వాసాలు పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా మొదటి ఆచారమైన దేవుళ్ల, దేవర్లకు, ఆచారరస్తులకు ముడుపులు కట్టు సాంప్రదాయాన్ని స్థానిక పోతురాజుస్వామి గుడి సోమవారం ప్రారంభించారు. గ్రామదేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సాంప్రదాయంలో భాగంగా కోవూరు, రామలింగాపురం చెన్నకేశవస్వాములకు, గ్రామ పోతురాజుస్వామికి, 10 గ్రామాల ఆచారస్తులకు ముడుపులు చేరవేసి వర్తమానం పంపనున్నారు. అలాగే అంకమ్మతల్లి ఆచార గ్రామదేవరులైన 25 దేవర ఇళ్లకు ఈ వర్తమాన ముడుపులను పంపనున్నట్లు తెలిపారు. సాంప్రదాయం ప్రకారం వారందరికీ ముడుపుల ద్వారా సమాచారం ఇస్తామని, పోతురాజు స్వామి, చెన్నకేశవస్వామి ఆచారవంతులైన కన్నమనీడు పల్నాటి చెన్నయ్య, రాధయ్యలచే ఈ వర్తమానం పంపుతామన్నారు. డిసెంబర్ 2వ తేదీన జరిగే నాగవాసాల పునఃప్రతిష్టా మహోత్సవంలో అందరూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు, మాదాల మాల్యాద్రి, ఆచార పినపెద్ద కోవూరు విష్ణు, ఆచార విద్యావంతుడు గొట్టిముక్కల గోవర్ధన్, పూజార్లు పోతురాజు, రామరాజు, చేబ్రోలు శ్రీనివాసరావు, మంగపాటి శ్రీను, సాధు మాధవ, కూనం మాధవరావు, తొట్టెంపూడి వేణు, గుర్రం మాల్యాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ సమావేశం

టంగుటూరు: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మంగళవారం టంగుటూరులోని పార్టీ కార్యాలయంలో కొండపి నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరయ్యే నాయకులు పూర్తి చేసిన గ్రామ బూత్ కమిటీ లిస్టుతోపాటు కులాల వారీగా ఓటరు జాబితా తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.